క్లుప్తంగా

హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ దేవస్థానం హుండీ కానుకల లెక్కింపును మంగళవారం దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో చేపట్టారు. డిసెంబర్ 18 నుంచి జనవరి 9వ తేదీ వరకు హుండీ కానుకల ద్వారా రూ.2,13,556లు ఆదాయం సమకూరినట్లు దేవాదాయశాఖ అధికారి కె.వెంకటరమణ తెలిపారు. హుండీ లెక్కింపు ప్రక్రియను దేవస్థానం ఉప ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీ ప్రసాద్ శర్మ, దేవాదాయశాఖ సిబ్బంది పర్యవేక్షించారు.

స్వచ్ఛందంగా సమ్మె విరమణ

పాలకొండ రూరల్: తమ సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మెబాట పట్టిన అంగన్వాడీల్లో కొందరు స్వచ్ఛందంగా సమ్మె విరమించి విధులకు హాజరవుతున్నారు. ఈ మేరకు పాలకొండ ఐసీడీఎస్ పీఓ శిమ్మాలమ్మకు మంగళవారం లిఖిత పూర్వకంగా తెలియజేశారు. పాలకొండ, వీరఘట్టం మండలాలకు చెందిన 27 మంది అంగన్వాడీ టీచర్లు, 29 మంది హెల్పర్లు, ఐదుగురు మినీ అంగన్వాడీలతో పాటు వీరఘట్టం మండలానికి చెందిన మరి కొంత మంది అంగన్వాడీలు స్వచ్ఛందంగా సమ్మెను విరమించుకుని విధులకు హాజరయ్యేందుకు సముకత చూపారని సీడీపీఓ తెలిపారు. మిగిలిన కార్యకర్తలు, సహాయకులు కూడా వెంటనే సమ్మె విరమించి విధుల్లో చేరాలని సీడీపీఓ కోరారు.

వైఎస్సార్ బీమా అందజేత



మృతుని భార్యకు బీమా డబ్బులు అందజేస్తున్న ఎంపీటీసీ అన్నాజీరావు

భామిని: మండలంలో బత్తిలికి చెందిన రవి పాత్రో అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. మృతుడు వైఎస్సార్ బీమాకు అర్హుడు కావడంతో ప్రభుత్వం బీమా పరిహారం మంజూరు చేసింది. తక్షణ సాయంగా రూ.10 వేలును ఎంపీటీసీ సభ్యుడు టింగ అన్నాజీరావు మంగళవారం మృతుని భార్య పద్మకు అందజేశారు. మిగిలిన మొత్తాన్ని నామినీ బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వమ్మరవిల్లి రమేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ గంగారావు, వలంటీర్లు మిన్నారావు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో వలంటీర్లు సహకరించాలి



సాలికిరిలో రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న డీఎస్ఓ దేవళ్లనాయక్

భామిని: గ్రామాల్లో రేషన్ పంపిణీ చేసే ఎండీయు వాహనాల వద్ద గ్రామ వలంటీర్లు ఉండి కార్డుదారులకు సరుకులు అందించేందుకు సహకరించాలని డీఎస్ఓ దేవళ్లనాయక్ సూచించారు. మండలంలోని పెద్దదిమిలి, బాలేరు, సాలికిరి, ఘనసర గ్రామాల్లో జరుగుతున్న రేషన్ పంపిణీని మంగళవారం పరిశీలించారు. నిత్యావసర సరకుల పంపిణీలో సహకరించిన వలంటీర్లకు అదనపు వేతనం వర్తిస్తుందని వివరించారు. ప్రతీ చోట విధిగా వలంటీర్లు తమకు కేటాయించిన 50 గృహాలకు రేషన్ను దగ్గరుండి అందించాలన్నారు. అనంతరం తహసీల్దార్ నీలాపు అప్పారావు, డీటీ నిమ్మల శేఖరంలతో సమావేశమై రేషన్ పంపిణీకి సంబంధించి పలు సూచనలు చేశారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, పార్టీ నాయకులు

భామిని: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని భామిని సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్, ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి అన్నారు. మండలంలోని లివిరిలో మంగళవారం జన్ భగీరథి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ నెల 19న విజయవాడలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు మద్దతుగా సంతకాలు సేకరించారు. మహనీయుడి ఆశయ సాధనకు కృషిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ నిమ్మల శేఖరం, కార్యదర్శి విశ్వేశ్వరరావు, డైరెక్టర్ కాగితాపల్లి కృష్ణారావు, సర్పంచ్ సౌధామిని, పార్టీ కన్వీనర్ భౌరి త్రినాథ్ పాల్గొన్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో 'ఆడుదాం ఆంధ్రా' మండల స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు, దుస్తులు అందజేశారు.

అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా..



నాడు

టీడీపీ హయాంలో రేషన్ సరుకులు మోసుకుంటూ వెళ్తున్న గిరిజన మహిళలు



నేడు

వాహనంలో ఇంటి వద్దకు రేషన్ సరుకులు తీసుకువచ్చి అందిస్తున్న దృశ్యం

సీతంపేట:

టీడీపీ ప్రభుత్వ హయంలో రేషన్ సరుకులు తీసుకునేందుకు గిరిజనులు చాలా ఇబ్బందులు పడేవారు. కిలో మీటర్ల దూరంలో ఉన్న డిపోలకు నడిచి వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి. గిరిశిఖర గ్రామాల లబ్ధిదారుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ సరుకులు నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే ప్రభుత్వం చేరవేస్తోంది. గతంలో రేషన్ బియ్యం కోసం అష్టకష్టాలు పడాల్సి వచ్చేదని, ఇప్పుడు ఇంటి వద్దకే తీసుకొచ్చి అందిస్తున్నారని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ కష్టాలు తొలగించిన సీఎం జగన్ మోహన్రెడ్డికి రుణపడి ఉంటామని అంటున్నారు.

మండలం: సీతంపేట

గ్రామాలు:	512	పంచదార:	10.48 టన్నులు
కొండ శిఖర గ్రామాలు:	224	కందిపప్పు:	15.63 టన్నులు
తెల్ల రేషన్కార్డులు:	16,323	గోదుమ పిండి:	16.24 టన్నులు
బియ్యం అలాట్మెంట్:	355.14 టన్నులు	రేషన్ తీసుకువెళ్లే వాహనాలు:	14

రేషన్ కష్టాలు తప్పాయి



మాకు రేషన్ కష్టాలు తప్పాయి. ఇళ్ల వద్దకే సరుకులు తీసుకువస్తున్నారు. ప్రతీ ఇంటి వద్దకు వచ్చి మనకు కావాల్సిన నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. గతంలో రేషన్ తీసుకోవాలంటే నడుచుకుంటూ వెళ్లి వరుసలో గంటల తరబడి నిలబడాల్సి వచ్చేది. జగనన్న వచ్చాక మా కష్టాలు తొలగాయి. – ఎర్రయ్య, చిన్నబగ్గ కాలనీ

ప్రజా సంకల్పయాత్ర చారిత్రాత్మకం

- ఐదేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు
- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

పాలకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర ఒక చారిత్రక ఘట్టమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ప్రజా సంకల్పయాత్ర పూర్తయి ఐదేళ్లు అయిన సందర్భంగా మంగళవారం పట్టణంలోని వైఎస్సార్ కూడలి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాదయాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకుని అధికారంలోకి వచ్చాక వాటన్నింటినీ పరిష్కరించిన సీఎం జగన్మోహన్రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో నగరపంచాయతీ వైస్ చైర్మన్ రౌతు హనుమంతురావు, పల్లా ప్రతాప్, పార్టీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాషరావు, పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మథరావు, కౌన్సిలర్లు తుమ్మగంట శంకరరావు, తూముల లక్ష్మణరావు, కొంచాడ అరుణ్కుమార్, పల్లా భాను, యందవ మరియదాస్, కోరాడ రవి, తదితరులు పాల్గొన్నారు.

- **పాలకొండ రూరల్:** రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి నడుం బిగించిన నాయకుడు వైస్ జగన్ అని ఎం.సింగుపురం సర్పంచ్ రణస్థలం రామాదేవి అన్నారు. ప్రజా సంకల్పయాత్ర పూర్తయి ఐదేళ్లయిన సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 3,648 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్రలో వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకున్నారని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతీహామీని నెరవేర్చి జనం మెచ్చిన నాయకుడయ్యారని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రణస్థలం రాంబాబు, తదితరులున్నారు.
- **వీరఘట్టం:** నేను విన్నాను..నేను ఉన్నాను అంటూ సాగిన వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రజా సంకల్పయాత్ర ముగింపుకు ఐదు వసంతాలు పూర్తవ్వడంతో మంగళవారం వీరఘట్టం మేజరుపంచాయతీలో ఐదు వసంతాల ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షురాలు దిబ్బ లలితకుమారి ఆధ్వర్యంలో వైఎస్సార్సీపీ నాయకులు సీఎం జగన్మోహన్రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జన నేత జగనన్న ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు చేసిన పాదయాత్ర చరిత్రాత్మకమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భోగి మణి, పిన్నింటి శ్రీను, శంభాన శ్రీను, పిన్నింటి దుర్గారావు పాల్గొన్నారు.
- **సీతంపేట:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రజా సంకల్పయాత్ర చేసి మంగళవారం నాటికి ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వైఎస్సార్సీపీ నాయకులు స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఐదేళ్లలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కె.సరస్వతి, పార్టీ మండల కన్వీనర్ జి.సుమిత్రారావు, ఏఎంసీ చైర్మెన్ హెచ్.మోహన్రావు, స్టేట్ స్టూడెంట్ వింగ్ కమిటీ సెక్రటరీ కె.భాస్కరరావు, సర్పంచ్లు ఎ.కళావతి, హెచ్.ఆదిలక్ష్మి, ఎంపీటీసీ హరిబాబు పాల్గొన్నారు.



వీరఘట్టం: సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్సీపీ నాయకులు



పాలకొండ: రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విక్రాంత్, తదితరులు



పాలకొండ రూరల్: ఎం.సింగుపురంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు



సీతంపేట: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న పార్టీ నాయకులు

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన

పాలకొండ రూరల్: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి పనిచేస్తున్నారని వైస్ ఎంపీపీ వాకముడి అనిల్కుమార్ అన్నారు. మండలంలోని అంపిలి గ్రామ సచివాలయం పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్లు, రేషన్ కార్డులను మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరావు మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో సంక్షేమ పథకాలు పొందాలంటే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదని, కానీ జగనన్న ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేస్తున్నారని అన్నారు. అన్నవరం సర్పంచ్ గవర రాజశేఖర్ మాట్లాడుతూ..జగనన్న ప్రభుత్వం పేదల ప్రభుత్వమని అన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థతో అర్హులకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు చేరవేస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్న ప్రభుత్వాన్నే ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకలు చింత సంఘంనాయుడు, తదితరులున్నారు.



లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

నెలాఖరులోగా పనులు పూర్తిచేయాలి

- ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్

గుమ్మలక్ష్మీపురం: ఈ నెలాఖరులోగా పర్యాటకాభివృద్ధి పనులు పూర్తిచేయాలని పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. మండలంలోని ఎల్విన్పేట పంచాయతీ ఎస్.కే పాడు ఉద్యానవన నర్సరీలో చేపడుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. రూ.60 లక్షలతో నిర్మించిన క్యాంటీన్, షాపింగ్ కాంప్లెక్స్, టాయిలెట్స్, ఇంటర్నల్ రోడ్లు, పార్కింగ్, ఆర్చ్ల నిర్మాణ పనులతో పాటు బోటు షికారు నిమిత్తం చెరువు వద్ద రూ.10 లక్షలతో చేసిన రివిట్మెంట్ (రాతికట్టు) పనులు, అలాగే పర్యాటకులు బస చేసేందుకు వీలుగా రూ.35 లక్షలతో నిర్మిస్తున్న డార్మెంటరీలను ఆయన పరిశీలించారు. పెండింగ్ పనులను ఈ నెలాఖరులోగా పూర్తిచేసి, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ నర్సరీలో పర్యాటకాభివృద్ధి పనులు పూర్తయితే నిరుద్యోగులైన ముగ్గురు, నలుగురు యువకులకు ఉపాధి అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే మండలంలోని ఎస్.కే పాడు గ్రామంలో సచివాలయం సిబ్బంది, వలంటీర్లు చేపడుతున్న ఆయుష్మాన్ భారత్ నమోదులను పీఓ పరిశీలించారు. ఆయన వెంట టీడబ్ల్యూ ఈఈ శాంతీశ్వరరావు, ఏఈ ఎస్.అప్పారావు, ఎంపీడీఓ ఎస్.సాల్మన్రాజు, వాటర్షెడ్ పీఓ పోలినాయుడు ఉన్నారు.



ఎస్.కే పాడు నర్సరీలో పర్యాటకాభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

ప్రకృతి సాగు విధానంలో అధిక దిగుబడులు

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ విధానంలో అధిక దిగుబడుల సాధించాలని డీపీఎం పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్టు ప్రాంగణంలో గుమ్మలక్ష్మీపురం డివిజన్ పరిధిలోని గరుగుబిల్లి, జియ్యమ్మవలస, కొమరాడ, కురుపాం, జీఎల్పురం మండలాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు మంగళవారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ దిగుబడులు పెరిగేలా సూచనలు సలహాలు ఇవ్వాలని సూచించారు. తెగుళ్లు రాకుండా కషాయాలు, ద్రావణాల తయారీపై అవగాహన కల్పించాలన్నారు. రబీ సీజన్లో అపరాలైన పెసలు, మినుములు, ఉలవలు, కొమ్ముశనగ, వేరుశనగ, తదితర పంటలను సాగుచేయడం వల్ల భూమిలో నత్రజని పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్లు వై.తిరుపతిరావు, జి.అన్నపూర్ణ, శ్రీనివాసరావు తదితరులున్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

గరుగుబిల్లి: మండలంలోని నాగూరు గ్రామానికి చెందిన అనకాపల్లి నరసింహులు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి ప్రభుత్వం నుంచి వృద్ధాప్య పింఛన్ వస్తుండడంతో గ్రామ వలంటీర్ అక్కేన రామ్మోహనరావు మంగళవారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు. సేవా భావం చాటుకున్న వలంటీర్ను సర్పంచ్ కె.శిరీష, చంద్రశేఖరస్వామి ఆలయ ట్రస్టు చైర్మన్ కె.కూర్మినాయుడు అభినందించారు.



నరసింహులకు పింఛన్ను అందజేస్తున్న వలంటీర్

గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి

పాలకొండ రూరల్: గిరిజన గ్రామాల్లో ప్రధాన మంత్రి జన్మాన్ కార్యక్రమం కింద ప్రభుత్వం కల్పించే సౌకర్యాల కల్పనపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు సూచించారు. మండలంలోని వెలగవాడ పంచాయతీ పరిధి సిరికొండ, గదబవలస, మల్లమ్మగూడ తదితర గిరిజన గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. స్థానిక ప్రజల అవసరాలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలపై ఆరా తీశారు. గిరిజనులకు ప్రభుత్వం అందించిన సంక్షేమ లబ్ధి, గృహ సౌకర్యం, విద్య, వైద్యం, మౌలిక వసతుల తాజా స్థితిగతులను మరింత మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు.



మల్లమ్మగూడలో గిరిజనుల అవసరాలపై ఆరా తీస్తున్న ఎంపీడీఓ

ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

- డీఎస్పీ జి.వి.కృష్ణారావు

గుమ్మలక్ష్మీపురం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని డీఎస్పీ జీవీ కృష్ణారావు సూచించారు. ఎల్విన్పేట వద్ద ఏర్పాటు చేసిన చెక్పోస్టును మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిషేధిత పదార్థాల అక్రమ రవాణాపై నిఘా పెట్టాలని, ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. అనతరం స్థానిక సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. కురుపాం, నీలకంఠాపురం, ఎల్విన్పేట ఎస్సైలకు పలు సూచనలు చేశారు. పాలకొండ డివిజన్లోని బత్తిలి పోలీస్ స్టేషన్ పరిధిలో 2 చెక్పోస్టులు, ఎల్విన్పేటలో 1, కురుపాం పోలీస్ స్టేషన్ పరిధిలో మూలిగూడ జంక్షన్ వద్ద ఒక చెక్పోస్టును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సారా, గంజాయి, నగదు వంటివి అక్రమంగా తరలించకుండా 24 గంటలు ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రజలు జూదాలు, అసాంఘిక కార్యక్రమాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా పండగ జరుపుకోవాలని సూచించారు. ఆయన వెంట సీఐ పి.సత్యనారాయణ ఉన్నారు.



ఎల్విన్పేట చెక్పోస్టు వద్ద రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ జి.వి.కృష్ణారావు

జగనన్న ఆరోగ్య సురక్ష-2కు విశేష స్పందన



కురుపాం: వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

కురుపాం: మండలంలోని గుమ్మ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు బి.ప్రజ్ఞ, శేషగిరిరావు, పవన్ శిబిరంలో పాల్గొని సుమారు 495 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అవసరమైన వారికి ఉచితంగా అందజేశారు. వైద్యశిబిరాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.జగన్నాథరావు సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీశారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో అందిస్తున్న వైద్య సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గుమ్మ, ఎగులవాడ గ్రామ సర్పంచ్లు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది సహకారం అందించారు.

- **భామిని:** జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ప్రతీ ఇంటికి వెళ్లి వైద్య సేవలందించాలని ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి, భామిని పీహెచ్సీ వైద్యాధికారి వి.సంతోషిలక్ష్మి అన్నారు. మండలంలోని బురుజోల, ఘనసరలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని వారు పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీటీ నిమ్మల శేఖరం, సర్పంచ్ మడపాన కేశవ, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

మండల సమావేశంలో పలు అంశాలపై చర్చ

జియ్యమ్మవలస: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొంగు సురేష్ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల పనితీరుపై చర్చించారు. విద్యాశాఖ పనితీరు, విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఎంఈఓ శ్రీనివాసరావు వివరించారు. కేజీబీవీలో తాగునీటి సమస్య ఉందని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీని కోరారు. దీనిపై ఎంపీపీ స్పందిస్తూ.. తాగునీటి బోరు మంజూరు చేస్తామని, త్వరలోనే పనులు చేపడతామని అన్నారు. రెవెన్యూ అంశాలపై చర్చ సందర్భంగా అంకవరం సర్పంచ్ అలజంగి నారాయణరావు జగనన్న భూసురక్షా కార్యక్రమంలో ఎంత మంది అర్హులకు పట్టాలు ఇచ్చారో తెలియజేయాలని అధికారులను కోరారు. రబీ కాలంలో నువ్వు పంటకు నీరు అందివ్వాలని ఇరిగేషన్ ఏఈ జి.వి.రఘును పలువురు సర్పంచులు కోరారు. ఎన్నడూ లేనంతగా ఈ సంవత్సరం ఖరీఫ్లో రైతులకు ఇబ్బంది కలుగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టినందుకు ఏఓ జ్యోత్స్నను సభ్యులు అభినందించారు. జగనన్న ఇళ్ల నిర్మాణం పూర్తిచేసిన లబ్ధిదారులకు వారి బ్యాంకు ఖాతాలో బిల్లులు జమచేసినట్లు హౌసింగ్ ఏఈ ఉమామహేష్ తెలిపారు. వెలుగు, ఉపాధిహామీ పథకాల నిర్వహణపై సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బిడ్డిక నరేష్, ఎంపీటీసీలు, సర్పంచ్లు పాల్గొన్నారు.



విద్యాశాఖ పనితీరును వివరిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు

కొలతల్లో తేడాలు.. చేయని పనులకు బిల్లులు

- సామాజిక తనిఖీల్లో ఆడిట్ బృందాల గుర్తింపు

గుమ్మలక్ష్మీపురం: ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది బాధ్యత యుతంగా విధులు నిర్వర్తించాలని పీడీ కె.రామచంద్రారావు అన్నారు. మండలంలోని 27 పంచాయతీల్లో 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఎంజీఎన్ఆర్ఈఎస్ ద్వారా వేతనాల రూపంలో రూ.16.01 కోట్లు, మెటీరియల్ రూపంలో రూ.2.60 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. గ్రామ స్థాయి సామాజిక తనిఖీలపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం ప్రజావేదిక నిర్వహించారు. పంచాయతీల వారీగా సామాజిక తనిఖీల నివేదికను అధికారులు చదివి వినిపించారు. ముఖ్యంగా కొన్ని పంచాయతీల్లో కందకాల పనుల్లో కొలతల్లో తేడాలున్నాయని, మస్టర్ల వద్ద వేతనదారుల సంతకాలు లేకుండానే చెల్లింపులు చేపట్టారని, కొన్ని మస్టర్ల వద్ద సంతకాల దిద్దుబాట్లు ఉన్నాయని చెప్పారు. చాపరాయి బిన్నిడి పంచాయతీలో మెటల్రోడ్డు పనులు చేపట్టకుండానే రూ.30 వేలు బిల్లుల చెల్లింపులు జరిగాయని, అదే పంచాయతీలో హెల్త్ వెల్నెస్ సెంటర్ నిర్మాణ పనుల్లో వేతనదారులు పనులు చేయకపోయినప్పటికీ, రూ.30 వేలు చెల్లించారని, ఇరిడి పంచాయతీలో చేపట్టిన పనులకు సంబంధించి భద్రగిరి గిరిజన సంక్షేమ ఇంజినీరింగు శాఖ అధికారులు రికార్డులు ఇవ్వలేదంటూ ప్రజావేదిక వద్ద తనిఖీ బృందాలు బహిర్గతం చేశాయి. దీనిపై స్పందించిన పీడీ ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాల్సి ఉందన్నారు. రికవరీలు, సిబ్బందిపై తీసుకునే చర్యలకు సంబంధించిన వివరాలను పీడీ బుధవారం వెల్లడిచేస్తారని ఎస్ఆర్పీ ఎం.తిరుపతిరావు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ జి.చంద్రారావు, ఎంపీడీఓ ఎస్.సాల్మన్రాజు, ఏపీఓ శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీలపై ప్రజావేదిక నిర్వహిస్తున్న పీడీ రామచంద్రారావు